
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
మంగళవారం 16 ఏప్రిల్ 2024

రాములోరి కళ్యాణానికి ఆలయాల ముస్తాబు 8లో..
ట్రాక్టర్ చోరీలకు పాల్పడుతున్న నిందితుల పట్టివేత 7లో..



సైబర్ నేరాలకు చెక్

సైబర్ వారియర్స్ నంబర్లివి..

జిల్లాలోని ధర్మపురి పోలీస్ స్టేషన్ వారియర్‌కు సెల్ ఫోన్ నంబరు 871 2657782, ఇబ్రహీంపట్నం 871265 7783, జగిత్యాల టౌన్ 8712657784, కొడిమ్యాల 8712657785, కోరుట్ల 8712657786, మెట్‌పల్లి 8712657787, మల్లాపూర్ 8712657788, రాయికల్ 8712657790, గొల్లపల్లి 8712657791, సారంగపూర్ 8712657792, కథలాపూర్ 871265 7793, మల్యాల 8712657794, పెగడపల్లి 8712657795, వెల్గటూరు 8712657796, బీర్పూర్ 8712657797, బుగ్గారం 8712657798, మేడిపల్లి 8712 657799, జగిత్యాల రూరల్ 8712 657800 నంబర్లను కేటాయించారు. బాధితులు ఎవరైనా సంబంధించి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సైబర్ వారియర్ సెల్ నంబరుకు కాల్ చేసి సేవలు పొందాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

- పోలీస్ స్టేషన్‌కు ఒకరి చొప్పున వారియర్స్ నియామకం
- ప్రత్యేక సిమ్ కార్డుల జారీ
- బాధితులకు సత్వర సేవలు అందించడానికి టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అరికట్టడానికి పోలీసులు ప్రత్యేక కార్యాచరణను చేపడుతున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్‌సీఎస్‌బీ) ఆధ్వర్యంలో అవసరమైన దృష్టి సారించింది. పోలీస్ స్టేషన్‌లలో నమోదయ్యే సైబర్ నేరాల దర్యాప్తును వేగవం తంగా జరిపేందుకు, బాధితులకు సత్వర న్యాయం చేకూరేందుకు జిల్లాలో రోజూ ఏదో ఒక చోట సైబర్ నేరగాళ్ల వలలో పడి ప్రజలు మోసపోతున్నారు. సైబర్ నేరాలు అరికట్టడంలో భాగంగా పోలీసులు ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహిస్తుండడం, కళాకారుల చేత ప్రదర్శనలు ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం సైబర్ నేరాలు అధికమవుతుండడంతో పో లీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బాధితులకు సత్వర సేవలు అందించడంలో చోటుచేసుకుంటున్న జాప్యాన్ని నివారించడంపై దృష్టి సా రించారు. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ బాధితులకు మరింత మెరు గైన సేవలందించేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్ సైబర్ వారియర్స్ పేరిట సిబ్బం దిని అందుబాటులోకి తీసుకొచ్చింది.

పోలీస్ స్టేషన్‌కు ఒక్కరు చొప్పున వారియర్...

జిల్లాలో ప్రతీ పోలీస్ స్టేషన్‌కు ఒకరు చొప్పున సైబర్ వారియర్స్‌ను నియ మించారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో రెండు వారాల పత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, మల్యాల పోలీసు సర్కిళ్ల పరిధిలోని 18 పోలీస్ స్టేషన్‌లలో ఒక్కొక్కరు చొప్పున సైబర్ వారియర్స్‌ను ఏర్పాటు చేశారు. వీరికి ఇప్పటికే అవ సరమైన శిక్షణ, అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా సిమ్ కార్డులను పంపిణీ చేశారు. సైబర్ నేరాలకు గురయిన బాధితులు సంబంధిత వారియర్స్‌ను సంప్రదిస్తే అవసరమైన తక్షణ సహాయాన్ని అందించడానికి ప్రయత్నాలు చేస్తారు.

నిర్వర్తించే విధులివే...

సైబర్ నేరాల వలలో పడి మోసపోయిన బాధితులు వారియర్స్‌ను సంప్రదిస్తే వారు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) లో వివరాలు నమోదు చేస్తారు. ఇది బాధితులు పోగొట్టుకున్న సొమ్మును రికవరీ చేసేందుకు దోహదపడుతుంది. 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసినా అక్కడి సిబ్బంది ఆయా పోలీస్ స్టేషన్లలోని సైబర్ వారియర్స్‌కు సమాచారం అందిస్తారు. బాధతులను స్టేషన్‌కు పిలిపించుకొని సత్వర సేవలందిస్తారు. నేషనల్ సైబర్ క్రైం పోర్టల్, హెల్ప్ లైన్ నంబరు 1930, సోషల్ మీడియా, ఆర్థిక నేరాల అదుపు, సైక్లాప్స్ అప్లికేషన్ వినియోగం, వారెంట్‌ల జారీ, విధులు, బాధ్యతలు ఇలా పలు అంశాలపై శిక్షణ తీసుకొని బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా నిందితులను గుర్తించడం సులువు అవుతుందని పోలీసు శాఖ భావిస్తోంది. సైబర్ మోసాలకు గురయిన బాధితులు ఏ మాత్రం ఆందోళన చెందవద్దని ఘటన చోటు చేసుకున్న తర్వాత వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు. రద్దీ కారణంగా టోల్ ఫ్రీ నంబరు 1930ను సంప్రదించడంలో కాస్త జాప్యం జరగడంతో దీన్ని నివారించేందుకు రాష్ట్ర పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు కోరుతున్నారు.

జిల్లాలో ప్రస్తుత యేడాది జరిగిన సైబర్ నేరాలు...

జిల్లాలో ప్రస్తుత యేడాది జనవరి నుంచి 398 సైబర్ మోసాలకు చెందిన కేసులు నమోదు అయ్యాయి. ఇందులో సుమారు రూ. 2,58,36, 590 మోసానికి గురయింది. సత్వరం ఫిర్యాదు చేయడం, పోలీసులకు సమాచారం అందించడం తదితర వాటి వల్ల సుమారు రూ. 28,37,565 లను పోలీసులు సేవ్ చేసి బాధితులకు అప్పగించడానికి ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలోనే సైబర్ మోసాల్లో సేవ్ అయిన అమౌంట్‌ను బాధితులకు రిఫండ్ చేయడంలో జగిత్యాల జిల్లా ద్వితీయ స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి.



సైబర్ వారియర్స్‌కు సిమ్ కార్డులు అందిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సైబర్ మోసాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

రంగారెడ్డి, సైబర్ క్రైం డీఎస్‌పీ, జగిత్యాల



సైబర్ మోసాలను నియంత్రిం చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుం టున్నాము. ఇందులో భాగంగా ఇప్ప టికే రాష్ట్ర వ్యాప్తంగా టోల్ ఫ్రీ నంబ రు ద్వారా బాధితులకు అవసరమైన సేవలు అందిస్తున్నా ము. దీంతో పాటు నూతనంగా పోలీస్ స్టేషన్‌కు ఒక్కరు చొప్పున సైబర్ వారియర్స్‌ను నియమించాము. బాధితులు ఎవరైనా సత్వరమే సైబర్ వారియర్స్‌ను సం ప్రదిస్తే అవసరమైన సేవలు అందిస్తారు.

వారియర్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

సన్‌ప్రీత్ సింగ్, ఎస్పీ, జగిత్యాల



జిల్లాలో ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సైబర్ వారియర్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. బాధితులకు సేవలు అందించడంలో ఎటువంటి జాప్యం ఏర్పడకుండా ఉండడానికి సైబర్ వారియర్స్‌ను నియమించాము. ఇప్పటికే సైబర్ వారియర్స్‌కు అవసరమైన శిక్షణను అందించడంతో పాటు సిమ్ కార్డులను సైతం పంపిణీ చేశాము. సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాము.

సీతారాముల కల్యాణానికి విచ్చేయండి

ప్రభుత్వ విప్ అడ్లూరికి ఆహ్వానం

ధర్మపురి, ఏప్రిల్ 15: ధర్మపురి మండలంలోని శాలపల్లెలో గల శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17న నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం కోసం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను హాజరు కావాలని కోరుతూ సోమవారం ఆలయ నిర్వాహకులు లసెట్టి నందయ్య స్వామి-సుజాత ఆహ్వానించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉన్న ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి, సతీసమేతంగా కల్యాణోత్సవానికి హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం శాలువా కప్పి, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. దీంతో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ కల్యాణోత్సవానికి హాజరవుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలన్నారు.

కాంగ్రెస్‌లోకి డాక్టర్ జేఎన్ వెంకట్

హైదరాబాద్‌లో మంత్రుల సమక్షంలో చేరికలు



జేఎన్ వెంకట్

కోరుట్ల, ఏప్రిల్ 15 : బీజేపీకి రాజీనామా చేసిన డాక్టర్ జేఎన్ వెంకట్ తన అనుచరులతో మంగళవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. హైదరాబాదులోని గాంధీ భవనంలో రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. వెంకట్ వృతి రీత్యా వైద్యుడు. చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి కొన్ని రోజులు పని చేసిన వెంకట్ మళ్లీ 2018లో బీజేపీలో చేరారు. గత ఎన్నికలో ఎమ్మెల్యే టికెట్ కొసం ప్రయత్ని భంగపడ్డాడు. తాజాగా తన అనుచరుల సూచనల మేరకు బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాడు. కోరుట్ల పట్టణం నుంచి తన అనుచరులతో హైదరాబాదు బయలు దేరడానికి ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఇది ఇలా ఉండగా గత అసెంబ్లీ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి సీఎస్‌ఆర్ అధినేత చెన్నమనేని శ్రీనివాస్ రావు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. దీంతో పాటు ఇటీవల అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన మెట్‌పల్లి మాజీ జడ్‌పీటీసీ ఆకుల లింగారెడ్డి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం.

ముగిసిన వెంకటేశ్వర స్వామి జాతర



విప్ లక్ష్మణ్ కుమార్, వంశీకృష్ణకు వేంకటేశ్వర స్వామి ప్రతిమలను అందిస్తున్న సభ్యులు

గొల్లపల్లి, ఏప్రిల్ 15 : గొల్లపల్లి మండలం వెన్గుమట్ల-బొంకూర్ గ్రామాల సరిహద్దులో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా చివరి రోజు స్వామి వారికి ఆలయ పూజారుల వేదమంత్రోచ్చారణల నడుమ శావ, ఏకాంత సేవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయంలో జడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ శంకరయ్య, చెందోళి సింగిల్‌విండో చైర్మన్ వెంకట మాధవరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ తాజామాజీ ప్రజా ప్రతినిధులు కందుకూరి సత్తయ్య, గుడ్ల లక్ష్మీరాజే శం, శ్రీధర్, మాజీ వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

●జాతర ముగింపు సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ సోమవారం ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆలయ పూజారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి ప్రతిమలతో పాటు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు పాల్గొన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

- వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు
- టిప్పర్లను ఠాణాకు తరలించిన పోలీసులు

మల్యాల, ఏప్రిల్ 15: చెరువుల మట్టిని అక్రమంగా తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల అనుమతులు లేకుండాని ఇటుకబట్టీలకు తరలిస్తున్నారు. మట్టి తరలుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బల్వంతాపూర్ శివారులలో గల రేగుల చెరువు నుంచి కొందరు ఇటుకబట్టీల వ్యాపారులు అక్రమంగా మట్టి తరలిస్తుండడంతో ఆదివారం గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. సోమవారం వేకువజాము నుంచే పదుల సంఖ్యల టిప్పర్లలో చెరువుమట్టిని రాజారం, జగిత్యాల, కరీంనగర్‌కు ఇటుకబట్టీలలోకి తరలిస్తుండడతంతో గ్రామస్తులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోగా పోలీసులు మట్టి తరలిస్తున్న పది టిప్పర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చర్యలు తీసుకొని వాహనాలను సీజ్ చేయాలని బల్వంతాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఎస్సై అబ్దుల్‌రహీంను సంప్రదించగా అనుమతులు ఉన్నాయా.. లేదా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

మాజీ ఎంపీ మధుయాష్కికి మాతృవియోగం

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్ర జ్యోతి): నిజామాబాద్ మాజీ ఎంపీ, టీపీసీసీ క్యాంపెయిన్ క మిటీ చైర్మన్ మధు యాష్కి గౌ డ్ సోమవారం మాతృ వియో గానికి గురయ్యారు. మధు యాష్కి గౌడ్ తల్లి అనసూయ (86) హై ద్రాబాద్ బంజారా హిల్స్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెం దినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అనసూయ మృతి పట్ల జగిత్యాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు సంతాపం తెలిపారు.

శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు

మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 15: శ్రీరామ నవమికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ చైర్ పర్సన్ అడు వాల జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించనున్న శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన వసతులను సోమవారం జ్యోతి పరిశీలించారు. మార్కండేయ, కోదండ రామాలయ ఆవరణాల్లో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను పరిశిలించి పలు సూచనలు చేశారు. కౌన్సిలర్లు అనుమల్ల కృష్ణహరి, నవీన్ ఉన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాయికల్, ఏప్రిల్ 15: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అల్లీపూర్ పరిధిలోని అయోధ్య గ్రామంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సహకార అధికారి సత్యనారాయణ ప్రారంభించారు. రైతులు తప్పతాలు లేకుండా శుభ్రపరిచిన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి మద్ధతు ధర పొందాలన్నారు. సంఘ ముఖ్య కార్య నిర్వాహణాధికారి ఉపేందర్ రావు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్‌లో చేరిన ఇరువురు మాజీ సర్పంచులు

కథలాపూర్, ఏప్రిల్ 15 : పేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తాండ్ర్యాల మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్, తుర్తి మాజీ సర్పంచ్ మట్కం గంగభూమయ్య సహా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గతంలో ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేని మళ్లీ 200 యూనిట్లకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఆనాడు కాంగ్రెస్ పాలనలోనే ఇచ్చామని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సూరమ్మ చెరువున రిజర్వాయర్‌గా మార్చుతాని గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని అందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనేక నిరసనలు చేసినా చలనం లేకుండా పోయిందన్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి కూడా సూరమ్మను పరిశీలించారని మొదటి ప్రాధాన్యం కింద పనులు పూర్తి చేయిస్తామన్నారు. ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఏనాడైనా సూరమ్మ చెరువు గురించి మాట్లాడారా అని ప్రశ్నించారు. నరేంద్రమోదీ జన్ ధన్ ఖాతాలో ధన్‌మని రు. 15 లక్షలు వేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి నయవంచన చేశారన్నారు. నూతనంగా పార్టీలోకి వచ్చిన నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోస కృషి చేస్తామని పేదల పక్షపాతిగా ఉండే కాంగ్రెస్ పట్ల నమ్మకం కుదిరి వచ్చామన్నారు. ప్రజా నేతగా పేరొందిన ఆది శ్రీనివాస్‌కు అండగా ఉంటామని ప్రతిన బూనారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, మాజీ మండల అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, బైర దేవ్, దేవారెడ్డి,పులి హరిప్ర సాద్, ఉరుమల్ల చారి, కట్ట శంకర్, మార్గం శ్రీనివాస్ ఉన్నారు.



తాండ్ర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల అనుమతితో పనులు సత్వరం పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర సంబంధిత అధికారులను ఆదే శించారు. సోమవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు, కమిటీల బాధ్యతలు, చేపట్టే పనుల వివరాలగురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో మొదటి ప్రాధాన్యత గల పనులను గుర్తించి కమిటీల అనుమతితో తీర్మానం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ అనుమతితో పనులు చేపట్టాలని సూచించారు. కమిటీ తీర్మానం మేరకు త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని తెలిపారు. తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ తదితర పనులు నిర్వహించాలన్నారు. డీఈవో జగన్‌మోహన్ రెడ్డి, డీఆర్‌డీఓ, జడ్పీ సీఈవో, డీపీవో, వివిధ మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఎంఈ వోలు, ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు, మం డల మహిళా స్వశక్తి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

అసత్య ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

రాజ్యసభ సభ్యుడు సురేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

సారంగాపూర్, ఏప్రిల్, 15 : ఎన్నికల సమయంలో అసత్య ప్రచారాలు చెప్పి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని రాజ్య సభ సభ్యుడు సురేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హాల్‌లో బీఆర్‌ఎస్ మండల స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టరు సంజయ్‌కుమార్, నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్, హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓడిపోవడంపై దేశంలో చర్చ జరుగుతోందన్నారు. బీఆర్‌ఎస్ ఓడిపోవడం పట్ల ఇప్పుడు ప్రజలు బాధపడుతున్నారని ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ వచ్చి కరువు తెచ్చిందని విమర్శించారు. ప్రజల సమస్యల కోసం అనునిత్యం కృషి చేస్తానని అన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబు అనుచరుడు ఇప్పుడు ఉన్నది డూప్లికేట్ కాంగ్రెస్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టరు సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 30 ఏండ్లలో చేసింది, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిందని వివరించారు. ఈ సంధర్బంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్‌రావు, వైస్ ఎంపీపీ సురేందర్, నాయకులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

జగిత్యాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో గల అనాథ వృద్ధులకు సోమవారం గౌడ అఫిషి యల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గోపా ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా వృద్ధులకు అన్నదానం చేశారు. జిల్లా గోపా అధ్యక్షుడు దుర్గపు రవీందర్, ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, కోశాధికారి గుర్రం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు దుర్గపు శ్రీనివాస్, బాలు సాని సత్తయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు పాల్గొన్నారు.

మున్సిపల్‌లో నిలిచిపోయిన పౌర సేవలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 15: గ్రేడ్ వన్‌గా ఉన్న జగిత్యాల మున్సిపల్‌లో సోమవారం పౌర సేవలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. మున్సిపల్ అధికారులు సరైన సమయంలో ఇంటర్ నెట్ బిల్లులు చెల్లించకపోవడంతోనే సేవలు నిలిచిపోచినట్లు తెలిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి చేరుకున్నప్పటికి నెట్ సేవలు లేకపోవడంతో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు పట్టించుకోకపోవడంతోనే సేవలు నిలిచిపోయినట్లు కార్యాలయ సిబ్బందే చర్చించుకోవడం కనిపించింది.

దొంగల బీభత్సం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 15: ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. పదిరలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన ఉన్న కుంభాల మహేందర్‌రెడ్డి ఇంటి తాళం పగులకొట్టి బీరువా, సూట్‌కేస్, డ్రెసింగ్ టేబుల్‌ను ధ్వంసం చేశారు. అందులోని దుస్తులు, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. దేవుడి గదిలోకి వెళ్లి ఫొటోలను తొలగించారు. ఆరు బయట నిలిపిన స్కూటీ, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. మహేందర్‌రెడ్డి దుబాయిలో ఉండడంతో అతడి భార్య నిర్మల పిల్లలతో కలిసి ఈ నెల 10న ఇంటికి తాళం వేసి గల్ఫ్ వెళ్లింది. అల్మాస్‌పూర్‌లోని ఎల్లమ్మ ఆలయం ప్రధాన ద్వారం తాళం బద్దలుకొట్టిన దొంగలు హుండీని ధ్వంసం చేసి అందులోని రూ.10 వేల నగదు, అమ్మవారి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. హుండీని ఆలయం బయట పడేశారు. పక్కనే ఉన్న సంతోష్ హోటల్ షటర్ తాళం పగులకొట్టారు.రూ.20 వేల నగదు, విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రూ.10 వేల విలువైన సిగరేటు ప్యాకెట్లు, శీతల పానీయాలను ఎత్తుకెళ్లారు. ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోడాగ్ స్క్వాడ్, వేలిముద్రల నమూనాల సేకరణ బృందం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు తులాల బంగారం, 15వేల నగదు అపహరణ

కోరుట్ల: పట్టణంలోని మినిట్యాంక్ బాండ్ సమీపంలోని తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. కాలనీకి చెందిన గుండ్లోజీ రాజేందర్ ఇంటికి తాళం వేసి ఆదివారం రాత్రి కటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తలుపులకు వేసి ఉన్న తాళం పగుల గొట్టి ఉంది. దీంతో యజమాని రాజేందర్ ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో సామగ్రి చిందర వందరగా పడి ఉండి బీరువా తాళం పగులగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ కిరణ్ కుమార్ క్లూస్ టీం సహాయంతో తనిఖీలు నిర్వహించారు. నాలుగు తులాల బంగారు అభ రణాలతో పాటు బీరువాలో ఉన్న రూ. 15000 నగదు అపహరణకు గురైనట్లు రాజేందర్ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 15: మండలంలోని చిన్న కలువలో జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. చిన్న కలువల గ్రామానికి చెందిన గాంట్ల తిరుపతి (40) స్థానికంగా టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అందులో నష్టం రావడంతో ఒకరి వద్ద గుమస్తాగా పనిచేశాడు. ఆర్థిక సమస్యలతో భార్య భర్తలు తరుచూ గొడవ పడేవారు. సోమవారం కూడా గొడవ జరగడంతో తిరుపతి బయటకు వెళ్లి మద్యం సేవించి ఇంటికి రావడంతో అసలే ఆర్థిక ఇబ్బందులు ఉండగా మళ్లీ మద్యం తాగి రావడమేంటని భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన తిరుపతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పదేళ్ల క్రితమే మొదటి భార్యతో విడాకులు కాగా రజితను రెండో పెళ్లి చేసుకున్నారు. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



రమేష్ (ఫైల్)

ముత్తారం ఏప్రిల్ 15: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన మొగిలి రమేష్ అలియాస్ రవి(45) అనే వ్యవసాయ కూలీ వడదెబ్బతో సోమవారం మృతి చెందాడు. మానేరు అవతల గల భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కలికోట శివారులో గల పొలం వద్దకు మోటారు వేద్దామని ఉదయం వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా మానేరులో కిందపడి ఉన్నాడు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడు రమేష్‌కు భార్య రాజేశ్వరి, కూతురు, కొడుకు ఉన్నారు.

నిధమ్‌లో టూరిజం కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 15: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిధమ్) గచ్చిబౌలి, హైదరాబాద్‌లో టూరిజం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదిత నిధమ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీలో బీఎస్సీ, బీబీఏ, ఎంబీఏ అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందులో టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలతో పాటు దేశంలోని హాస్పిటాలిటీ ఇండస్ట్రీలో అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. జాతీయస్థాయి విద్యావిధానంతో నిధిమ్‌లో ఉన్నత ప్రమాణాలతో కోర్సులు అందిస్తుందని, అడ్మిషన్, ఇతర వివరాలకు జిల్లా పర్యాటకశాఖ కార్యాలయం, కరీంనగర్‌లోగానీ జిల్లా పర్యాటకశాఖ అధికారి 94408 16070లో సంప్రదించాలని సూచించారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 51 మంది రైతులు 644 క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 18 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

భక్తోత్సవం ప్రారంభం

అశ్వ వాహనంపై స్వామివారల విహారం


స్వామివారి ఉత్సవమూర్తులు

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శ్రీరామ భక్తోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు మూడు రోజులపాటు నిర్వహించే శ్రీరామ భక్తోత్సవంలో తొలిరోజు ఉదయం ఆలయ స్థానా చార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేదపండితులు స్వస్తిపుణ్యాః వచనము, గౌరీపూజ, పంచగవ్య మిశ్రణం, ఋత్విక్ వరుణము, యాగశాల ప్రవేశం, మండపారాధన నిర్వ హించారు. అర్చకుల కు వరుణి అందజేశారు. అంతకుముందు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకా దశ రుద్రాభిషేకం, శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఉపనిషత్ ద్వారా అభిషేకం చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి పార్వతీరాజ రాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీఅనంత పద్మనాభస్వామి వారలను అశ్వ వాహనంపై ఊరేగించారు. ఉత్సవాలలో భాగంగా ఈ నెల 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ చంద్రస్వామి వారల దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయ చైర్మన్ అతిథిగృహం ముందుభాగంలో వేదికతోపాటు భారీ ఏర్పాట్లు చేపట్టారు.


అర్చకులకు వరుణి అందజేస్తున్న ఆలయ స్థానాచార్యులు


అశ్వవాహనంపై విహరిస్తున్న స్వామివారు

భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం సోమవారం భక్త జనసంద్రంగా మారింది. శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పెద్దసంఖ్యలో భక్తులు బద్ది పోచమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


బారులుదీరిన భక్తులు

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు
ముగ్గురికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 15: శంకరపట్నం మండలం కేశవపట్నం శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం సమీపంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహ దారిపై సోమవారం ఉదయం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి ప్రభాకర్ కారులో అతని బంధువు గోనెల సుదర్శన్, గోనెల శ్రీవర్షినిలు మానకొండూర్ మండలం కొండపలకలలో దశదిన కార్యక్రమానికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున తిరిగి రాంపూర్‌కు వస్తున్నారు. ఈ క్రమంలోనే కేశవపట్నం శివారులో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలట్ గోపికృష్ణలు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుదర్శన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం వెన్నంపల్లికి చెందిన శ్రీకాంత్, శంకరపట్నం మండలం చింతగుట్టకు చెందిన మేఘన ద్విచక్ర వాహనంపై కరీంనగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టినట్లు తెలిపారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనం ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.

20 నుంచి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు

కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిబిరాల నిర్వహణ

18వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు



మాట్లాడుతున్న కేడీసీఏ అధ్యక్షుడు ఆగమ్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్15: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అనుబంధ సంఘం అయిన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి వేసవి ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగమ్‌రావు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రికెట్ శిక్షణ శిబిరాలను కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అండర్-14, 16, 19, 23 వయస్సు విభాగాలలో బాలబాలికలకు ఈ ఉచిత శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా శిక్షణ కేంద్రాల్లో నిష్ణాతులైన కోచ్‌లు, ట్రైనర్లను నియమిస్తున్నామని చప్పారు. అలాగే క్రీడాకరుల కోసం క్రికెట్ నెట్లతో పాటు జంబోకిట్లు, అందుబాటులో ఉంచామన్నారు.

ఈ శిక్షణ శిబిరాలలో ప్రతిభ చాటే క్రీడాకారులను హెచ్‌సీఏ, కేడీసీఏల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9 వరకు ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఆరు సంవత్సరాల తరువాత ప్రతిష్ఠాత్మ కంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ శిబిరాలలో పాల్గొనే సదావకాశాన్ని క్రీడా కారులు వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి గల బాల బాలికలు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్‌లో ఈనెల 16 నుంచి 18 తేదీ సాయంత్రం 6 గంటల వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20న ప్రారంభమయ్యే ఉచిత శిక్షణ శిబిరాలు మే నెల 20వరకు నెల రోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఏ సహకారంతో ఉదయం పౌష్టికాహారాన్ని అందించనున్నామన్నారు. అలాగే త్వరలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో కెపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా క్రికెట్ సంఘం బాధ్యులు ఉచిత క్రికెట్ శిబిరాల ప్రచార బ్రోచర్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు తమ సందేహాలను నివృత్తికి 80087 29397 నంబరులో సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో కేడీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం మురళీధర్‌రావు, ఉపాధ్య క్షుడు పి మనోహర్‌రావు, కె మహేందర్‌గౌడ్, క్రికెట్ కోచ్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాలపై నిర్లక్ష్యం

● ఇరవై రోజుల క్రితం చర్యలకు ఆదేశం ● ఎట్టకేలకు కొండగట్టు ఉద్యోగులకు మెమోలు

మల్యాల, ఏప్రిల్ 15: దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలపై గత ఇరవై రోజులుగా స్తబ్దుగా ఉన్న అధికారులు కదిలారు. కొండగట్టు అంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో కొన్నాళ్ల క్రితం విధులు నిర్వహించిన ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌తో పాటు పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్‌కు సోమవా రం ఈవో చంద్రశేఖర్ మెమొలు జారీ చేశారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ చారీ దేవస్థానానికి సంబంధించిన టెండర్ల సొమ్ములు దాదాపు రూ.52లక్షలు దుర్వినియోగం చేశారనే దానిపై అప్పట్లోనే అప్పటి ఈవో వెంకటేష్ శ్రీనివాస్‌చారీతో పాటు పర్యవేక్షణ అధికారులకు చార్జీ మెమోలు అందించారు. అనంతరం శ్రీనివాస్ చారీని సస్పెండ్ చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లోనూ కేసు నమోదు చేశారు. కొన్నాళ్లకు ఏడీసీ జ్యోతి సొమ్ముల దుర్వినియోగంపై విచారణ జరిపిన అనంతరం పర్యవేక్షణ లోపం, నిర్లక్ష్యం వహించినందుకు గాను గత నెల 23న ఈవోపై దేవాదాయశాఖ క మిషనర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈవోపై చర్యలు తీసుకుంటూనే సదరు పర్యవేక్షణ అధికారుల నిర్లక్ష్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే ఇక్కడి అధికారులు కమిషనర్ ఆదేశాలపై ఇరవై రోజులు గడిచినప్పటికీ కమిషనర్ ఆదేశాలపై ముందుకు కదలకపోగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఎట్టకేలకు సోమవారం ముగ్గురు అధికారులకు మెమోలు అందించారు. అంజన్న సొమ్ముల దుర్వినియోగంపై గత పదేళ్ల రికార్డుల తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది.

జమ్మికుంటలో మద్యం పట్టివేత

జమ్మికుంట, ఏప్రిల్ 15: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని హనుమండ్లపల్లిలో ఓ వ్యక్తి అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను సోమవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఓ వ్యక్తి తన ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడని సమాచారం అందుకున్న బ్లూకోర్టు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. రూ.2,280 విలువ గల మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఏప్రిల్ 15: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన ఓ బెల్ట్ షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజకుమార్ సోమవారం తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్ముతుండగా అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రూ. 30వేల జరిమానా విధించినట్లు తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 15: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను సోమవారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ముగ్గురు వాహనదారులకు ఐదు రోజుల జైలుశిక్ష, నలుగురు వాహనదారులకు మూడు రోజుల జైలు శిక్ష, మొత్తం రూ. 12 వేల జరిమానా విధించారని తెలిపారు. మిగతా 14 మంది వాహనదారులకు 23, 500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 15: మండలంలోని మల్యాల గ్రామ సమీపంలో సోమవారం లారీ(టీఎస్ 24 7272)లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఎస్సై ఓంకార్ యాదవ్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అంబాల రవి అక్రమంగా ఇసుక వ్యాపారం నిర్వహించేవాడని, అందులో భాగంగానే అర్థరాత్రి సమయంలో గుంపుల గ్రామ సమీపంలోని మానేరు నది వద్దకు వెళ్లి అక్కడ జేజా శ్రీనివాస్ జేసీబీ సహాయంతో ఇసుకను లోడ్ చేసి, లోడింగ్ పూర్తయిన తర్వాత అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌తోపాటు లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

వేములవాడ, ఏప్రిల్ 15 : వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ చెందిన ఎండీ షారుక్ (26) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఫాజుల్ నగర్‌కు చెందిన షారుక్ కుటుంబం కొంతకాలంగా వేములవాడలోని అర్బన్ కాలనీలో నివాసం ఉంటోంది. ఆదివారం రాత్రి శాత్రాజుపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో సాయిరక్ష సమీపంలో రహదారి మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతంలో ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీ కొట్టాడు. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, 11 నెలల వయస్సు ఉన్న కూతురు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ట్రాక్టర్ చోరీలకు పాల్పడుతున్న నిందితుల పట్టివేత

● ముగ్గురితో పాటు బాలుడి అరెస్ట్ ● ట్రాక్టర్, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ల స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మల్యాల, ఏప్రిల్ 15: వ్యవసాయంతో వస్తున్న ఆదాయం సరిపోవడం లేదని ఎక్కువగా సంపాదించాలనే అత్యాశతో ట్రాక్టర్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులతో పాటు ఓ బాలుడిని పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని రాజారంలో ఇటీవల ట్రాక్టర్ ఎత్తుకెళ్లిన దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపల్లికి చెందిన సింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో బాలుడు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షామ్‌నగర్‌కు చెందిన పెంబి రాజులు వ్యవసాయం, కూలీపనులతో వచ్చే ఆదాయం సరిపోక ట్రాక్టర్‌ల దొంగతనాలకు పాల్పడుతూ ఉన్నారు. ఇందులో భాగంగా కొన్నాళ్ల క్రితం చంద్రశేఖర్‌రెడ్డి, రాజు గుడిహత్నూర్‌లో ట్రాక్టర్ దొంగతనం చేయడంతో అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మళ్లీ దొంగతనాలకు జగిత్యాల ప్రాంతానికి వచ్చిన నలుగురు రెక్కీ నిర్వహిస్తూ మల్యాల మండలం రాజారం శివారులో గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి ముందు నిలిపి ఉన్న రెండు ట్రాక్టర్లలో ఒక్క దాన్ని ఎత్తుకెళ్లారు. ఆ ట్రాక్టర్‌ను ఎవరూ గుర్తు పట్టకూడదని కొండగట్టు ప్రాంతంలోని గుట్టలలో రంగులు మార్చి సోమవారం తమ గ్రామానికి తీసుకెళుతుండగా ముగ్గురు నిందితులతో పాటు బాల నేరస్థుడిని కొండగట్టు వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వారి వద్ద ట్రాక్టర్, ట్రాలీ, ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కోర్టులో హాజరుపరచినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, ఎస్సైలు అబ్దుల్‌రహీం, కుమారస్వామి పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి

● అడిషనల్ కలెక్టర్ రాంబాబు



మల్యాలలో నిర్వాహకులకు సూచనలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 15: ధాన్యం కొనుగోలు కేంద్రాలలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులను అడిషనల్ కలెక్టర్ రాంబాబు ఆదేశించారు. మండలంలోని మల్యాల, ముత్యంపేట, ఏఎంసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. కొనుగోళ్ల క్రమ పద్ధతిలో త్వరితగతిన పూర్తి చేయాలని ధాన్యం నిలువ, రక్షణకు తీసుకోవాల్సిన అన్ని సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని అన్నారు. తూకం వేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, ఆర్ఐ తిరుపతి, ఏపీఎం రాజయ్య, సీఈవో గోవర్ధన్ రైతులు ఉన్నారు

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

పెగడపల్లి, ఏప్రిల్ 15 : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా తేమశాతం వచ్చిన ధాన్యం తూకం వేస్తూ, కేంద్రాలలో కుప్పలు పేరుకుపోకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని బతికెపల్లిలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని, రాములపల్లిలో నంచర్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావర్ శ్రీనివాస్, సెర్ప్ ఏపీఎం సమత, నంచర్ల సీఈవో మధూకర్, రాజు ఉన్నారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంపు

ధర్మపురి, ఏప్రిల్ 15: ధర్మపురి మండలంలోని శాలపల్లెలో మంచిర్యాలకు చెందిన డాక్టర్ అనంతరెడ్డి క్రిటికల్ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్వాహకులు లసెట్టి నందయ్యస్వామి-సుజాత ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉచిత మెడికల్ క్యాంపు, అన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలకు చెందిన డాక్టర్ అనంతరెడ్డి క్రిటికల్ కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకేసాయినాథ్‌రెడ్డి ఈ మెడికల్ క్యాంపులో పేషెంట్లకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పేషంట్లు హాజరై మెడికల్ క్యాంపును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి, ఏప్రిల్, 15 : రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. వడదెబ్బ బారిన ప్రజలు పడకుండా కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని ప్రజలకు కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. మధ్యాహ్నం సమయంలో పిల్లలను బయటకు పంపొద్దని, నిలిపి ఉన్న వాహనాలలో పిల్లలను, పెంపుడు జంతువులను ఎక్కించవ్వదని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాముడు ఆదర్శ పురుషుడు

సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ స్వామి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 15 : శ్రీ రాముడు ఆదర్శ పురుషుడని వారి చరిత్ర మానవాళికి చక్కని మార్గంగా చూపించారని సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ హరితీర్థ స్వామి అన్నారు. శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి 55వ వార్షికోత్సవాన్ని నిర్వాహకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవా ల్లో భాగంగా ఉదయం నుంచి స్వామి వారికి మందిరంలో ప్రత్యేక పూజలు, భగవద్గీత పారాయణం వంటి కార్యాక్రమానలు జరిపించారు. వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ స్వామి, శ్రీ వీరజ నందతీర్థ స్వామిలు పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు భగవద్గీత, రామాయణం, మహాభారతం వంటి వాటిని చదివి విలువలను తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాత పరమేశ్వరి మండల వ్యవస్థాపక అధ్యక్షుడు గాజంగి బాలయ్య, గాజంగి రాజమల్లయ్య, రామకృష్ణ, జయకృష్ణ, భక్తులు, పాల్గొన్నారు.

ఒలింపియాడ్, ఐఐటీలో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ఏప్రిల్ 15 : గైడియల్ ఒలింపియాడ్, ఐఐటి హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఇంగ్లీష్, గణితం, సైన్స్ విభాగాలలో నిర్వహిం చిన పరీక్షలలో గౌతమ్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి అవార్డులను అం దుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ గఫార్ సోమవారం తెలిపారు. గైడియల్ ఒలంపియాడ్‌లో జాతీయ స్థాయిలో 6, 16 ర్యాంకు జోబియా సబీన్, షేక్ ఫైజన్ రాష్ట్ర స్థాయిలో 4, 12, 18 ర్యాంకులలో అరీబా హనూన్, షిజా అనమ్, నక్క రేష్మేంద్ర, జిల్లా స్థాయి టాపర్స్‌గా అయెషా ఫిరదోస్, జోబియా సబీన్, జేవేరియా బతుల్ అవార్డులను అందుకున్నట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ఐఐటిలో జాహ్నవి, వానియా నాజ్, మెదటి స్థానంలో సి.హెచ్ మనోజ్ఞ, శ్రావని విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్ గఫార్, పాఠశాల ప్రెసిడెంట్ యంఎ కిజర్, సెక్రటరీ యంఎ అఫ్రోజ్, ప్రిన్సిపల్ గోపి మారసి అభినందించారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

కొడిమ్యాల, ఏప్రిల్ 15 : కొడిమ్యాల మండలంలోని పలువురు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సుమారు 32 మంది బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూకుమ్మడిగా నాయకులు రాజీనామా చేరటంతో బీఆర్ఎస్ భారీ షాక్ తగిలింది. బీఆర్ఎస్‌కు పట్టుగా తయారైన మండలంలోని పలు గ్రామాల నాయకులు, తాజామాజీలు మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటించారు. అనంతరం గంగాధరలో చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యంను కలిశారు. పూడూర్ సింగిల్ విండో చైర్మన్ బండ రవీందర్‌రెడ్డి, చెప్యాల ఎంపీటీసీ, మాజీ ఎంపీపీ రామస్వామి, మండలంలోని మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు పలువురు కార్యకర్తలు ఉన్నారు.

ఉత్కంఠభరితంగా సాగిన ఎడ్లబండ్ల పోటీలు



పోటిలో పరుగులు తీస్తున్న ఎండ్లబండి

గొల్లపల్లి, ఏప్రిల్ 15 : వెంకటేశ్వర స్వామి జాతర ముగింపు ఉత్సవాలను పురస్క రించుకుని ఆలయ కమీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలు సోమవారం తీవ్ర ఉత్కంఠభరితంగా సాగాయి. పోటీలను మాజీ వైస్ ఎంపీపీ ఎల్లాల నారాయణ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 25 ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. వెల్గటూర్ మండలం జగదేవ్ పేట గ్రామానికి చెందిన బచ్చల శివకృష్ణకు చెందిన ఎడ్లబండి ప్రథమ విజేతగా నిలిచి దాత గొల్లపల్లి తాజా మాజీ సర్పంచ్, గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి-దీప్తి దంపతులు అందించిన 4 గ్రాముల బంగారం కైవసం చేసుకున్నారు. ద్వితీయ విజేతగా గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ అయాన్, తృతీయ విజేతగా తిర్మలాపూర్ (పీడీ) గ్రామానికి చెందిన షేక్ భాషామియాలకు చెందిన ఎడ్ల బండ్లు నిలిచి దాతలు బొంకూర్ గ్రామానికి చెందిన నాడేం ప్రియాం క-మనోహర్ దంపతులు అందించిన 2 గ్రాముల బంగారం, వెన్గుమట్ల గ్రామానికి చెందిన నేరేళ్ల పద్మ-చంద్రగౌడ్ దంపతులు అందించిన 4 గ్రాముల వెండిని గెలుచుకున్నా రు. అనంతరం విజేతలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మన్ కుమార్, పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ బహుమతులను ప్రదానం చేశారు. జడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ శంకరయ్య, చెందోళి సింగిల్‌విండో అధ్యక్షులు వెంకటమాధవరావు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఆలయాల ముస్తాబు

● రాయికల్ మండలంలో రెండు గ్రామాల ఐకమత్యం

● అయోధ్య నుంచి రామయ్య.. ఉప్పుమడుగు నుంచి సీతమ్మ

● ఈ నెల 17న సీతారాముల కల్యాణం



అయోధ్యలో కల్యాణానికి ముస్తాబైన ఆలయం

రాయికల్, ఏప్రిల్ 15: అయోధ్య అనగానే మనకు శ్రీరాముని జన్మస్థలం గుర్తుకొస్తుంది. కానీ రాయికల్ మండలంలో సైతం అయోధ్య గ్రామం ఉంది. గ్రామంలోని కోదండ రామాలయంలో 37 ఏళ్లుగా శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీరాముడు వనవాస సమయంలో ఇక్కడికి వచ్చారని, అందుకే గ్రామంలో ఆలయం నిర్మించామని ప్రజలు పేర్కొంటున్నారు. రాయికల్ మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు (జంట) గ్రామాలు కలిసి ఉంటాయి. యేటా రెండు గ్రామాల ప్రజలు కలిసిక ట్టుగా శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. 1987లో ఇరు గ్రామాల ప్రజలు తమ శ్రమదానంతో కోదండ రామాలయాన్ని నిర్మించారు. అయోధ్య నుంచి రామయ్యను, ఉప్పుమడుగు నుంచి సీతమ్మ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకు వచ్చి నవమి రోజు కల్యాణం నిర్వహించి ఇరు గ్రామాల ప్రజలు ఐక్యత చాటుతున్నారు. యేటా అయోధ్యలో జరిగే శ్రీ రాముని కల్యాణానికి ప్రభుత్వం నుంచి తహసీల్దార్ దంపతులు ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి కల్యాణ మహోత్సవాన్ని అం గరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ నెల 17న శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు ఇబ్బం దులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.



సీతారాముల విగ్రహాలు

ఉత్సవాలకు ముస్తాబైన రామాలయాలు

పెగడపల్లి : శ్రీరామనవమి ఉత్సవాలకు మండలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని నామాపూర్, నం చర్ల, ఎల్లాపూర్, అయిత్‌పల్లి గ్రామాలలో సీతారామచంద్ర స్వామి ఆలయాలు ఉండగా మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయాలలో రాములోరి కల్యాణం ప్రతి యేటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. నామాపూర్ ఆలయంలో మూడు రోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా ఉత్సవాలు జరుగనుండగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. 16న మంగళవారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేక ములు, కంకణదారణ, కళశస్థాపన పూజ, 17న బుదవారం ఉదయం 5 గంటలకు సుప్రభా తసేవ, మధ్యాహ్నం 12.25 నిమిషాలకు సీతారామ కల్యాణం, అన్నదానం, 18న గురువారం సీతారాముల పూర్ణాభిషేకం, శ్రీహరి మౌనస్వామి రోటిగూడెం వారి ఆధ్వర్యంలో 18 హోమగుండములతో గీతా సంపూర్ణ హవన యజ్ఞం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయక మిటీ సభ్యులు పేర్కొన్నారు.



ఉత్సవాలకు ముస్తాబవుతున్న నామాపూర్ రామాలయం

ఆకట్టుకున్న ఫైర్ సిబ్బంది విన్యాసాలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 15: జిల్లా కేంద్రంలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. పాత, కొత్త బస్టాండ్ కూడలిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం అగ్ని మాపక నివారణ చర్యలపై ప్రజలకు జగిత్యాల ఇన్‌చార్జి అగ్ని మాపక అధికారి మధు వివరించారు. సిబ్బంది మల్లేశం, సదయ్య, రవీందర్, ప్రశాంత్ ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నిర్వహించారు. స్థానిక బస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బంది ఆయిల్ గ్యాస్, దట్టమైన పొగ నుంచి ఎలా కాపాడాలి చేసి చూపించారు. అగ్ని ప్రమాదాలు నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. లీడింగ్ ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, ప్రవీణ్ రావు, సిబ్బంది కృపాకర్, శంకరయ్య, రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, ఎండీ రఫిక్, ఎండీ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.



ధర్మపురి, మెట్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి: అగ్ని ప్రమాదాలను అరికట్టి జాతి సంపదను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రం అధికారి మల్లికార్జున్‌యాదవ్ పిలుపునిచ్చారు. అగ్నిమాపక వారోత్సవాల భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్, బస్ డీపో, కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో మార్క్ డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు, వాలు పోస్టర్లను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఎండ వేడిమి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఆందోళన చెందకుండా మంటలు ఆర్పేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలను అరికట్టడానికి తీసుకునే సూచనలు సలహాలను ప్రజలకు విన్యాసాలతో సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది హైదూల్లాఖాన్, అంజనేయులు, అమర్‌సింగ్, సంతో ష్‌కుమార్, భాస్కర్, సంతోష్, శ్రీకాంత్, ఆర్టీసీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నం

కథలాపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని తక్కళ్ళపల్లిలో సోమవారం సాయంత్రం తాళం వేసి ఉన్న ఇంట్లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి యత్నించారు. నక్క లక్ష్మీ పరగ్రామానికి వెళ్లగా తాళం వేసి ఉన్నట్టు గమనించిన బోధన్‌కు చెందిన నలుగురు వ్యక్తులు ఇంట్లో చొరబడ్డారు. దీంతో పక్కనే ఉన్న ఓ వ్యక్తి గమనించి పలువురి సహాయంతో వారిని పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సహా సిబ్బంది అక్కడికి చేరుకుని నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరు బోధన్‌కు చెందిన వ్యక్తులుగా అనుమానిస్తున్నారు. పాత సామాను సేకరించడానికి వచ్చి చోరీకి పాల్పడ్డట్టు స్థానికులు తెలిపారు.

వైభవంగా సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ధర్మపురి, ఏప్రిల్ 15: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో గల వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సీతారామచంద్ర స్వామి శిల విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులకు వేదపండితులు సంగనభట్ల దిలీప్‌శర్మ, గుండి నర్సయ్యశర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధాన సంకల్ప గణపతి పూజ, నవగ్రహ సర్వతోభద్ర మండల పూజలు నిర్వహించారు. అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమాలు, మూర్తి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

అడిషనల్ (ఏఆర్) ఎస్పీ భీమ్‌రావు

రాయికల్, ఏప్రిల్ 15: రానున్న లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని అడిషనల్ (ఏఆర్) ఎస్పీ భీమ్‌రావు అన్నారు. రాయికల్ పట్టణంలో సోమవారం జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలిసి నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఎలక్షన్ కమిషన్ సూచించిన ప్రకారం పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తారని తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రజలకు భరోసా కల్పించడంలో భాగంగానే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినా వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగదు రవాణాకు సంబంధించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో డీఎస్పీ రఘుచందర్, సీఐ ఎస్ ఎఫ్ అధి కారులు, సీఐ ఆరిఫ్ అలీఖాన్, ఎస్సై అజయ్, పోలీస్ సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



రాయికల్‌లో ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న అడిషనల్ (ఏఆర్) ఎస్పీ

శివారు ప్రాంతాల్లో..జోరుగా పేకాట

● పేకాట నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ

● సొమ్ము చేసుకుంటున్న దళారులు

మల్యాల, ఏప్రిల్ 15: మండలంలో పేకాట జోరుగా సాగుతోంది. శివారు ప్రాంతాలు, మామిడి తోటలే పేకాట స్థావరాలుగా వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వ్యక్తులు పేకాటలో మునిగి తేలుతున్నారు. పేకాటను కొందరు వృత్తిగా మలచుకొని పలు ప్రాంతాల్లోని పేకాట ఆడే వ్యక్తులకు సమాచారమందిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో కొందరు హైదరాబాద్ తదితర ప్రాంతాలలో పేకాట ఆడగా ఇటీవల కొందరు ఇక్కడి వ్యక్తులే పేకాట నిర్వహిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. మామిడి తోటలు, గుట్టల ప్రాంతాలు, మండలాల సరిహద్దు, అద్దె గదులను స్థావరాలుగా మార్చి పేకాట నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మండలంలో ప్రస్తుతం పేకాటను మల్యాల మండలం, ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు పేకాటరాయుళ్లే చెబుతున్నారు. పోలీసులు పలుమార్లు పేకాట స్థావరాలపై దాడులు చేసి పలువురిని పట్టుకుంటునప్పటికీ కొందరూ ఇంకా కొనసాగిసున్నారు.

● వేలల్లో వసూలు..

పేకాట ఆడించే నిర్వహకులు ఒక్కో ఆటకు నిర్ణీత డబ్బులు వసూలు చేయడం గమనార్హం. ఒకేరకమైన ఆట కొన్ని గ్రూప్‌లు ఆడుతూ గ్రూప్ ఆడే ఆటకు కొంత మొత్తం వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పేకాటలో ముఖ్యంగా రమ్మీ కెనిస్టా, తీన్‌పత్తి, దొంగ జోకర్ లాంటి ఆటలు ఆడుతుండగా ఏడుగురు వ్యక్తులు ఆడే రమ్మీ ఆటను కొన్ని గ్రూప్‌లు నిత్యం ఆడుతుంటాయి. ఒక్కో గ్రూప్ రోజుకి పది సార్లు ఆడుతుండగా ఒక్కో ఆటకి రూ.వెయ్యి వరకు నిర్వాహకులు వసూలు చేయనునట్లు పేకాట ఆడేవాళ్లే చెబుతున్నారు. దీన్ని బట్టి పది సార్లు అంటే రూ. పదివేలు ఒక గ్రూప్ నుంచే వసూలు అవుతుండగా, ఇలాంటి ఇంకా అనేక గ్రూప్‌లు వివిధ ఆటలు ఆడుతాయని, కొన్ని ఆటలు మూడు నిమిషాల్లో ముగియనుండగా, రోజుకి కొన్ని గంటలు ఆరుగురు చొప్పున గ్రూప్‌లు ఆడుతుంటాయి. దీనికి గాను ఒక్కో ఆటకు రూ. వంద వసూలు చేస్తూ, గంటకు రూ.2 నుంచి 3 వేలు నిర్వాహకులు దండుకోనున్నారు. నిర్వహకులు వసూలు చేసిన డబ్బుల నుంచే పేకాట రాయుళ్లకు భోజన వసతి కల్పించడం విశేషం. కొన్ని సందర్భాల్లో మందు సౌకర్యం ఏర్పాటు చేస్తుండగా, పేకాడుతూ పట్టుబడకుండా ఈ డబ్బుల నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తుండడంతోనే పేకాట ఆడడానికి తాము వెలుతున్నట్లు కొందరు బహిరంగగానే పేర్కొంటున్నారు. మల్యాల మండలంలో మల్యాల, మేడిపల్లి, గొల్లపల్లి, గంగధర మండలాల సరిహద్దులల్లో లోని అటవీ ప్రాంతాలు, గుట్టలు, మామిడి స్థావరాల్లో, ఎక్కువ పేకాట నిర్వహిస్తారని, సరిహద్దుల్లో నైతే పోలీసులు పట్టించు కోరనేది వారి ధీమాగా కనిపిస్తోంది. పేకాటకు మల్యాల, కొడిమ్యాల, గొల్లపల్లి, పెగడపల్లి, జగిత్యాల తదితర మండలాల నుంచి వస్తుండ గా వచ్చేవారిని నిర్వాహకులు ఎవరికంటా పడకుండా దొడ్డి దారిన పేకాట స్థావరాలకు తరలిస్తూ, పేకాట ఆడే వాళ్లకు కూడా, అక్కడకు, వెళ్లే వరకు స్థావరం ఆచూకీ తెలుపకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్థావరాలపై ఎవరికీ అనుమానాలు రాకుండా తరచూ మార్పులు కూడా చేస్తుంటారు. ఇటీవల మల్యాల మండల కేంద్రం పరిధిలో జోరుగా పేకాట ఆడుతున్నారని, ఇళ్ల మధ్య కూడా సాగుతుందని పలువురు పేర్కొంటున్నారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు నిర్వహిస్తున్న ఈ పేకాట నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు పోలీసులను కోరుతున్నారు



● పేకాట నిర్వహిస్తే చర్యలు తప్పవు

అబ్దుల్ రహీం, ఎస్సై, మల్యాల

పేకాట నిర్వహించినా, ఆడినా చర్యలు తప్పవు. ఇప్పటికే వచ్చే సమాచారం మేరకు దాడులు చేస్తూ పలువురిని పట్టుకుంటున్నాం. పేకట నిర్వహనపై, ఆడే వారిపై తమకు తమకు కాని డయల్ 100కు గాని సమాచారం అందించాలి. సమాచారం అందించే వివరాలు గోప్యంగా ఉంచుతాము. మండలంలో పేకాటపై ప్రత్యేక దృష్టి సారించి నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటాం

ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయుడు

కొడిమ్యాల, ఏప్రిల్ 15 : మండలంలోని సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి బాబు జగ్‌జీవన్‌రాం జాతీయ ఎక్సలెన్స్ అవార్డును సోమవారం ఆన్‌లైన్ ద్వారా అందుకున్నట్లు తెలిపారు. పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం, సమాజ సేవ చేయటం అంశాలపై ఎక్సలెన్స్ అవార్డు వచ్చినట్లు తెలిపారు. రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన ప్రైవేటు వైద్యుడు మొర్రి లింగమూర్తి మండలంలో పలు గ్రామాలలో సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించినందుకు తెలుగు వెలుగు సాహితి వేదిక అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉగాది మహానంది జాతీయ పురస్కారానికి ఎంపికై అవార్డును అందుకున్నారు. వీరిని పలువురు మండల ప్రముఖులు అభినందించారు.

హార్వెస్టర్ యాజమానులకు అవగాహన

భీమారం, ఏప్రిల్ 15: మండలంలోని మన్నెగూడెం, భీమారం, దేశాయిపేట గ్రామాల్లో సోమవారం హార్వెస్టర్ యాజమానులు, డ్రైవర్లకు ఏవో త్రివేదిక, ఏఈవోలు సురేందర్ నాయక్, నరేందర్‌లు అవగాహన సదస్సు నిర్వహించారు. హార్వెస్టర్ బ్లవర్ ఆర్‌పీఎం 18-19 పెట్టడంతో నాణ్యమైన ధాన్యం వస్తుందని, దీంతో ఆ ధాన్యానికి మద్దతు ధర వస్తుందన్నారు. కోసిన వరిధాన్యాన్ని రైతులు తమ కల్లా వద్దనే ఆరబెట్టుకుని ప్రభుత్వం ప్రకటించిన నాణ్యత ప్రమాణాలు లోబడి వచ్చిన తర్వాతనే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు.

సిరికొండలో శివపార్వతుల కల్యాణం

కథలాపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని సిరికొండలో సోమవారం మహదేవ స్వామి ఆలయంలో శివపార్వ తుల కల్యాణం కమనీయంగా జరిగింది. అభిషేకం అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా మంగళవాయిద్యాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మెట్‌పల్లి, ఏప్రిల్, 15 : పట్టణానికి చెందిన శ్రీరామ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు కుల సంఘాలు, యువకులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. వారి పేరు మీద పోస్ట్ ఆఫీస్‌లో రూ. 40వేలను డిపాజిట్ చేశారు. పట్టణంలోని శ్రీ విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షుడు పులిమామిడి చంద్రయ్య, హిందూ సేన పాతబస్తీ ప్రధాన కార్యదర్శి తిప్పారపు లక్ష్మణ్‌లు వారి చేతుల మీదుగా రాజు కుటుంబ సభ్యులకు డిపాజిట్ పత్రాలను అందజేశారు. నాయకులు కొడిమ్యాల వెంకటస్వామి, అంజయ్య, హన్మండ్లు, తిప్పారపు లక్ష్మణ్, శ్రీధర్‌చారి, రవీందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గౌడ సంఘ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కోరుట్ల, ఏప్రిల్ 15 : పట్టణంలోని కౌండిన్య గౌడ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడుగా తోడేటి విజయ్ కుమార్ గౌడ్, కోశాధికారిగా పోతుగంటి వెంకటేష్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా బట్టు సత్యంగౌడ్, గంగాధరి రాజేందర్, తోడేటి శంకర్ గౌడ్, పోతుగంటి సురేష్ గౌడ్, బట్టు శేఖర్ గౌడ్, అశోక్ గౌడ్, పోతుగంటి రవిగౌడ్, పోతుగంటి ప్రభాకర్ గౌడ్‌లతో అసోసియేషన్ సభ్యులు ప్రమాణ స్వీకరం చేయించారు. వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ సన్మానించి అభినందిచారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

మెట్‌పల్లి, ఏప్రిల్, 15 : కాంగ్రెస్ పార్టీలోకి పలు గ్రామాలకు చెందిన నాయకులు నియోజక వర్గం పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో చేరారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారిక కాంగ్రెస్ కండువా కప్పి సాదరణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకటేష్‌గౌడ్, అల్లూరి మహేందర్‌రెడ్డి, నరేష్, కిషోర్, గుండా శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తం, నల్ల రమేష్, భూష రాజేశ్వర్ పాల్గొన్నారు.

కోతల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

మల్లాపూర్, ఏప్రిల్, 15 : వరి కోతల సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన ధాన్యం అందుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి సాయిప్రియ అన్నారు. సోమవారం మండలంలోని చిట్టాపూర్ గ్రామంలోని వరి కోతలు చేస్తున్న పంటలను పరిశీలించారు. రైతులు కొత్తపెల్లి రవితేజ, గడ్డం రాజ్‌కుమార్, శేఖర్, జలంధర్, హార్వెస్టర్ డ్రైవరు, పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 15 : కూలీలు గంటల తరబడి పన్నుల్లో నిమగ్నమైన సమయంలో నీరసం చెం దకుండా వారి క్షేమం కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచాయతీ కార్యదర్శి నిజాముద్దిన్ అందజేశారు. సోమవారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వేసవిలో పని చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, నిర్వహకులు, రైతులు, కూలీలు, పాల్గొన్నారు.